



EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
10-12-2024
పేజీలు: 02





## స్పామ్ కాల్స్ బెడద.. తెలుగు స్టేట్స్ టాప్!

తెలుగు రాష్ట్రాల ప్రజలకు స్పామ్ కాల్స్ ఇబ్బందిగా మారాయి. ఎయిర్‌టెల్ స్పామ్ రిపోర్ట్ ప్రకారం అత్యధికంగా స్పామ్ కాల్స్ గుర్తించిన రాష్ట్రాల్లో తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నాయి. ముఖ్యంగా పురుషులు(76%), అందులోనూ 36-60 ఏళ్ల మధ్యనున్న వారినే టార్గెట్ చేస్తున్నట్లు గుర్తించారు. ఈ స్పామ్ కాల్స్ రోజూ ఉదయం 11 నుంచి 3PM వరకు వస్తాయని తెలిసింది. వీకెండ్స్‌లో తక్కువగా కాల్స్ వస్తాయని వెల్లడైంది.

## యానిమల్ మూడు పార్ట్‌లు

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా వచ్చిన 'యానిమల్' సినిమా భారీ కలెక్షన్స్ ను సాధించి.. అద్భుత విజయాన్ని సాధించింది. ఈ సినిమా సీక్వెల్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో 'యానిమల్' మూవీ రెండో పార్ట్ షూటింగ్ 2027లో ప్రారంభం కానుందని హీరో రణ్‌బీర్ కపూర్ చెప్పారు. ప్రస్తుతం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా వేరే ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్నారని.. అందుకే 2027లో స్టార్ట్ చేస్తాం అని రణ్‌బీర్ క్లారిటీ ఇచ్చారు. అలాగే, యానిమల్‌కు పార్ట్-3 కూడా ఉంటుందని రణ్‌బీర్ వెల్లడించారు. రెండో పార్ట్‌లో హీరో-విలన్ మధ్య ఆసక్తికర పోరు ఉంటుందని.. ముఖ్యంగా పార్ట్-2 యానిమల్ పార్క్‌గా రాబోతుందని రణ్‌బీర్ తెలిపారు. ఐతే, ఈ సినిమా పై ఎన్నో విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. రీసెంట్ గా ఈ విమర్శలపై హీరో రణ్‌బీర్ కపూర్ స్పందించారు. 'యానిమల్ విషయంలో అందరి అభిప్రాయాలతో నేను కూడా పూర్తిగా ఏకీభవిస్తున్నాను. అందులో ఎలాంటి సందేహం లేదు. ఐతే, ప్రేక్షకులకు నచ్చే సినిమాలు తీసుకురావాల్సిన బాధ్యత మా పై ఉంది. కొత్తదనాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఒక నటుడిగా ఇది చాలా ముఖ్యం. ఎప్పుడైతే నటులందరూ విభిన్నమైన పాత్రలు పోషిస్తారో.. అప్పుడే వారి కెరీర్ బాగుంటుంది' అంటూ రణబీర్ తెలిపిన సంగతి తెలిసిందే.



# శబరిమలలో వీఐపీ దర్శనంపై వివాదం

శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో వీఐపీ దర్శనంపై వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. డిసెంబర్ 5వ తేదీన శబరిమల సన్నిధానంకు నటుడు దిలీప్ వెళ్లారు. అయితే ఆ సమయంలో ఆయనకు ప్రత్యేక దర్శన వసతులు కల్పించారు. దీని వల్ల సాధారణ భక్తులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆ కేసులో హైకోర్టుకు స్పెషల్ ఆఫీసర్ వివరణ అందజేశారు. సన్నిధానం స్పెషల్ ఆఫీసర్ బిజోయ్ ఓ రిపోర్టును కేరళ హైకోర్టు సమర్పించారు. నటుడు దిలీప్ దర్శనం ఏర్పాట్లను దేవస్థానం బోర్డు చూసుకున్నట్లు ఆయన చెప్పారు. పోలీసులు ఆ ఏర్పాటు చేయలేదన్నారు. అయితే భక్తులకు దర్శనం సులభంగా కల్పించే రీతిలో తాము పనిచేస్తుంటామని సన్నిధానం వద్ద ఉన్న సీనియర్ పోలీసు అధికారులు తెలిపారు. ఈ ఘటన పట్ల దేవస్థానం విజిలెన్స్ ఇప్పటికే ఓ రిపోర్టును అందజేసింది. సన్నిధానం స్పెషల్ ఆఫీసర్ కూడా ఆ విషయాన్ని తన స్టేట్మెంట్‌లో తెలిపారు. నటుడు దిలీప్ దర్శనం చేసుకున్న సమయంలో జరిగిన లోపాలపై ట్రావెన్‌కోర్ దేవస్థాన బోర్డును కేరళ హైకోర్టు తప్పుపట్టింది. నటుడికి ప్రిఫరెన్స్ ఇవ్వడం వల్లే సాధారణ భక్తులు సరైన రీతిలో దర్శనం చేసుకోలేకపోయినట్లు కోర్టు పేర్కొన్నది. హరివాసనం పూర్తి అయ్యే వరకు నటుడు దిలీప్ సోపానం వద్ద ఉండిపోయాడరని బెంచ్ తెలిపింది. వీఐపీ దర్శనం కోసం సాధారణ భక్తుల దర్శనం నిలిపివేయడం పట్ల కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై వివరణాత్మక రిపోర్టును ఇవ్వాలని కోర్టు కోరింది.



## భారీగా పెరిగిన బంగారం ధరలు

హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.750 పెరిగి రూ.72,050కు చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.820 పెరగడంతో రూ.78,600 పలుకుతోంది. కేజీ సిల్వర్ రేటు ఏకంగా రూ.4వేలు పెరిగి రూ.1,04,000కు చేరింది. గత 10 రోజుల వ్యవధిలో ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో దాదాపు ఇవే ధరలు ఉన్నాయి.




## 'ఎల్ఐసీ బీమా సఖి'.. నెలకు రూ.7,000 స్టైఫండ్

మహిళా సాధికారిత లక్ష్యంగా ఎల్ఐసీ బీమా సఖి యోజన పథకాన్ని పీఎం మోదీ ప్రారంభించారు. ఏడాదిలో లక్ష మందిని నియమించుకోనున్నట్లు ఎల్ఐసీ ఎండీ సిద్ధార్థ్ మహంతి ప్రకటించారు. టెన్త్ అర్హత కలిగి 18-70ఏళ్ల వయసున్న మహిళలు అర్హులు. వీరికి మూడేళ్లపాటు ఆర్థిక అంశాలు, బీమాపై శిక్షణ ఇస్తారు. తొలి ఏడాది ₹7వేలు, రెండో ఏడాది ₹6వేలు, మూడో ఏడాది ₹5వేలు చొప్పున ప్రతినెలా స్టైఫండ్ అందిస్తారు. శిక్షణ తర్వాత ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేయొచ్చు.

## ఢిల్లీలో మళ్లీ అధ్వాన స్థితికి చేరిన గాలి నాణ్యత

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మళ్లీ సాధారణ స్థితికి చేరింది. గత వారం కాస్త మెరుగుపడిన వాయు నాణ్యత.. ఈ వారం అధ్వాన స్థితికి చేరింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 224గా నమోదైంది. ఐటీవో ప్రాంతంలో ఏక్యూఐ లెవల్స్ 254గా, అలీపూర్‌లో 214గా, ఛాందినీ చౌక్ వద్ద 216, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ప్రాంతంలో 203గా గాలి నాణ్యత నమోదైంది. కొన్ని ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో మోడరేట్ కేటగిరీలో గాలి నాణ్యత సూచీ నమోదైంది. డీటీయూలో 169, లోధి రోడ్డులో 123, నజఫ్‌గర్‌లో 142గా ఏక్యూఐ ఉంది. ఇక నిన్న ఢిల్లీలో గాలి నాణ్యత 231గా నమోదైన విషయం తెలిసిందే. గత వారం ఏక్యూఐ లెవల్స్ 200 లోపే నమోదయ్యాయి. గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే



తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు.



## 28వ సారి.. రేపు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ నెల 11 నుంచి 13 వరకూ రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. ప్రత్యేక విమానంలో బుధవారం ఉదయం జైపూర్ వెళ్లి, వారి బంధువుల వివాహంలో పాల్గొననున్నారు. అనంతరం అటునుంచి ఆయన ఢి ల్లీ వెళ్లనున్నారని సీఎంవో వర్గాలు తెలిపాయి. ఏడాది కాలంలో రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లటం ఇది 28వ సారి. నామినేటెడ్ పోస్టుల భర్తీ, క్యాబినెట్ విస్తరణ తదితర అంశాలపై కాంగ్రెస్ అధిష్ఠానం తో సీఎం మాట్లాడనున్నారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. కాగా క్యాబినేట్ విస్తరణపై సీనియర్ కాంగ్రెస్ నేత లు, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య ఏకాభిప్రాయం కుదరటం లేదని ప్రచారం జ రుగుతున్నది. రేవంత్‌రెడ్డి వలస కాంగ్రె స్ నేతలకు ఎక్కువ పదవులు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుండగా.. పాత కాపులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే సీఎం వలస నేతల పేర్లు ఢిల్లీకి సిఫారసు చేయగా.. హైకమాండ్ తిరస్కరించినట్టు సమాచారం. ఈసారైనా ఢిల్లీ టూర్‌తో మంత్రివర్గ విస్తరణపై సస్పెన్స్‌కు తెరపడుతుందా? అన్న చర్చ జరుగుతున్నది.



## అంతకుమించితే ప్రమాదం!

వ్యాయామం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, పరిమితికి మించి శరీరాన్ని ఇబ్బందిపెడుతూ కష్టాలను కొనితెచ్చుకోవద్దని సలహా ఇచ్చింది కథానాయిక రకుల్‌ప్రీత్‌సింగ్. ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యతనిచ్చే ఈ భామ రెండు నెలల క్రితం జిమ్‌లో గాయపడిన విషయం తెలిసింది. 80 కిలోల బరువును ఎత్తే క్రమంలో ఆమె వెన్నెముకపై అధికభారం పడటంతో అనారోగ్యానికి గురైంది. ఇటీవల కోలుకున్న ఈ భామ తన ఆరోగ్యం గురించి అప్‌డేట్ అందించింది. ఆరోగ్యపరంగా శరీరం అందించే సంకేతాలకు జాగ్రత్తగా గమనించాలని, అందుకు అనుగుణంగా నడచుకోవాలని సూచించింది. 'వెన్నెముక గాయం రెండువారాల్లో తగ్గిపోతుందనుకున్నా. కానీ రెండు నెలల టైమ్ పట్టింది. ఈ గాయం వల్ల కఠినమైన వ్యాయామాలకు దూరంగా ఉంటున్నా. సరళమైన ఆహారాన్ని తీసుకుంటున్నా. మన శారీరక పరిమితిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉంటుంది. కానీ ఒక్కోసారి అంతకుమించిన శ్రమతో ఇబ్బంది పెడతాం. అలాంటి తప్పుల వల్లే అనుకోకుండా ప్రమాదంలో పడతాం' అని చెప్పుకొచ్చింది ఇటీవల సినిమాలకు కాస్త గ్యాప్ వచ్చిన రకుల్ ప్రీత్.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## 24 గంటల్లో రూ.3.16లక్షలు లాస్

క్రిప్టో కరెన్సీ పెద్దన్న బిట్‌కాయిన్‌లో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. 24 గంటల్లోనే $3736 (Rs.3.16L) నష్టపోయింది. నేడు మాత్రం స్వల్ప లాభాల్లో ట్రేడవుతోంది. $97,318 వద్ద ఓపెనైన BTC $97,040 వద్ద కనిష్ఠ, $98,159 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. $477 లాభంతో $97,960 వద్ద చలిస్తోంది. ఇక ఎథీరియమ్ 4.86, XRP 10.45, సొలానా 5.78, BNP 4.96, DOGE 9, ADA 12.73, షిబాఇను 13% మేర పతనమయ్యాయి. క్రిప్టో Mcap తగ్గింది.

## నేటి నుంచి సమ్మెలోకి సమగ్ర శిక్ష ఉద్యోగులు

తమను రెగ్యులర్ చేసి జీతాలు పెంచాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 19వేల మందికి పైగా సమగ్ర శిక్ష ఉద్యోగులు నేడు సమ్మెలోకి దిగనున్నారు. తమను రెగ్యులర్ చేస్తామని గతేడాది సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదని తెలిపారు. 20 ఏళ్లుగా తక్కువ జీతాలకు పని చేస్తున్నామని వాపోతున్నారు. బోధన, బోధనేతర సిబ్బంది సమ్మెతో కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు, భవిత సెంటర్లలో బోధన నిలిచిపోయే అవకాశం ఉంది.

## ఆర్జీవీ బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నేడు హైకోర్టులో విచారణ జరగనుంది. చంద్రబాబు, పవన్, లోకేశ్‌పై అసభ్యకర పోస్టులు చేశారనే ఆరోపణలతో ఆర్జీవీపై పలు కేసులు నమోదైన విషయం తెలిసిందే. వీటిపై ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించగా తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను శుక్రవారం వరకు పొడిగించింది.


## కర్ణాటక మాజీ సీఎం ఎస్‌ఎం కృష్ణ కన్నుమూత

కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మాజీ మంత్రి ఎస్‌ఎం కృష్ణ కన్నుమూశారు. గతకొంత కాలంగా వృద్ధాప్యం రీత్యా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. మంగళవారం తెల్లవారుజామున బెంగళూరు సదాశివనగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఈ ఏడాది 29న ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా బెంగళూరులోని మణిపాల్ హాస్పిటల్‌లో దవాఖానలో చేరారు. నాలుగు నెలలపాటు చికిత్స అనంతరం కోలుకున్న ఆయన ఆగస్టు 28న డిశ్చార్జ్ అయ్యారు. అయితే ఆయనను ఆ తర్వాత కూడా అనారోగ్య సమస్యలు వెంటాడటంతో మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు.



## ట్రంప్ జట్టులోకి మరో భారత సంతతి వ్యక్తి

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ తన క్యాబినెట్‌లోకి భారత సంతతి మహిళను ఎంపిక చేశారు. సిక్కు కమ్యూనిటీకి చెందిన ఇండో అమెరికన్ లాయర్ హర్మీత్ ధిల్లాన్‌ను మానవ హక్కుల అసిస్టెంట్ అటార్నీ జనరల్ పోస్టుకు నామినేట్ చేశారు. ఇప్పటికే ఆయన తన కార్యవర్గంలోకి భారత మూలాలున్న వివేక్ రామస్వామి, కోల్‌కతాలో జన్మించిన భట్టాచార్య, కశ్యప్ పటేల్ (కాష్ పటేల్)ను నామినేట్ చేసిన విషయం తెలిసిందే.



## వచ్చే వారం పోలవరంలో సీఎం పర్యటన

సీఎం చంద్రబాబు వచ్చేవారం పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ఆ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన టైమ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తారని తెలిపారు. జనవరి నుంచి డయాఫ్రం వాల్ పనులు మొదలవుతాయన్నారు. దానికి సమాంతరంగా ఎర్త్ కం రాక్ ఫిల్లింగ్ పనులు కూడా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పునరావాస పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఒకే జిల్లాలో 322 మంది పిల్లల మృతి.. బీజేపీ ఫైర్

కర్ణాటక బెళగావి జిల్లాలోని GOVT ఆస్పత్రుల్లో JAN నుంచి 322 మంది నవజాత శిశువులు చనిపోయినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. APR-OCT మధ్య 29 మంది మహిళలు ప్రసవానంతరం చనిపోయారని తెలిపింది. ఈ ఘటనలపై విపక్ష BJP ఆగ్రహం వ్యక్తం చేసింది. కర్ణాటక కాంగ్రెస్ మోడల్ అంటే డెత్ ట్రాప్ అని విమర్శించింది. ఆరోగ్య శాఖను కాంగ్రెస్ శ్మశానవాటికగా మార్చిందని, తల్లులు, పిల్లల ప్రాణాలను తీస్తోందని దుయ్యబట్టింది.

# బోయింగ్ సంస్థలో ఉద్యోగుల తొలగింపు



అమెరికాలోని బోయింగ్ సంస్థలో భారీ స్థాయిలో ఉద్యోగుల్ని తొలగించారు. వాషింగ్టన్, కాలిఫోర్నియా రాష్ట్రాల్లో ఉన్న అదనపు ఉద్యోగుల్ని తీసివేశారు. సుమారు 17 వేల మందిని తొలగించే పనిలో బోయింగ్ సంస్థ ఉన్నది. వాషింగ్టన్ రాష్ట్రంలో 400 మంది, కాలిఫోర్నియా రాష్ట్రంలో 500 మంది బోయింగ్ ఉద్యోగుల్ని తొలగించారు. ఆర్థికపరమైన, రెగ్యులేటరీ సమస్యలతో ఇబ్బందిపడుతున్న ఆ సంస్థ ఉద్యోగుల్ని క్రమపద్ధతిలో తొలగించనున్నట్లు గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. రాబోయే కొన్ని నెలల్లో సుమారు పది శాతం మంది ఉద్యోగులను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నవంబర్‌లోనే ఉద్యోగులకు సమాచారాన్ని అందజేశామని సీఈవో కెల్లి ఓర్ట్‌బర్గ్ తెలిపారు. ఇంజినీర్ల నుంచి రిక్రూటర్ల వరకు, విశ్లేషకులను కూడా తొలగించినట్లు చెప్పారు. దీని వల్ల కమర్షియల్, డిఫెన్స్, గ్లోబల్ సర్వీసులకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. తొలగించిన ఉద్యోగులు.. పేరోల్‌లో రెండు నెలల పాటు ఉంటారన్నారు. వాళ్లకు హెల్త్ ఇన్సూరెన్సు లాంటి సౌకర్యాలు మరో మూడు నెలలు పాటు ఉంటాయన్నారు. 2018, 2019 సంవత్సరాల్లో బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలు కూలిపోవడం వల్ల ఆర్లింగ్టన్, వర్జీనియాలోని సంస్థలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

# ఉచిత రేషన్‌పై సుప్రీం నిలదీత




ఎంతకాలం ఈ ఉచితాలు అందచేయాలి అంటూ సుప్రీంకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. కొవిడ్ మహమ్మారి మొదలైనప్పటి నుంచి వలస కార్మికులకు ఉచిత రేషన్ లభిస్తోందని, దీనికి బదులుగా వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం, వారిలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2013 నాటి జాతీయ ఆహార భద్రతా చట్టం కింద 81 కోట్ల మంది ప్రజలకు ఉచిత లేదా సబ్సిడీ రేషన్‌ను అందచేస్తున్నట్లు కేంద్రం ఇచ్చిన సమాచారంతో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. దీన్ని బట్టి పన్ను చెల్లింపుదారులు మాత్రమే మిగిలినట్టున్నారు అంటూ కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటిలను ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2020లో కొవిడ్ కాలంలో మొదలైన వలస కార్మికుల కష్టాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పేర్కొంటూ ఓ ఎన్జీఓ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ శ్రమ్ పోర్టల్‌లో నమోదైన వలస కార్మికులందరికీ ఉచిత రేషన్ సమకూర్చేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోర్టును కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఎంతకాలం ఉచితాలు ఇవ్వాలి? ఈ వలస కార్మికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి, నైపుణ్యాభివృద్ధిని పెంపొందిచడానికి మనం ఎందుకు పని చేయకూడదు? అని ప్రశ్నించింది.



## నెటిజన్స్‌కు దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చిన జాన్వీ

పుష్ప2 చిత్రం తొలిరోజు ప్రపంచ వ్యాప్తంగా రూ. 275.20 కోట్లు వసూలు చేసి చరిత్ర సృష్టించింది. దీని తర్వాత ఈ చిత్రం రెండవ రోజు కూడా ప్రపంచ వ్యాప్తంగా తన జోరును కొనసాగించింది. ప్రపంచ వ్యాప్తంగా రెండు రోజుల్లో ఈ సినిమా కలెక్షన్స్ 400 కోట్లు దాటేసింది. ఇక ఈ సినిమా పై కొందరు పనిగట్టుకొని నెగిటివ్ కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా అలాంటి వారికి అదిరిపోయే కౌంటర్ ఇచ్చింది అందాల భామ జాన్వీ కపూర్.'పుష్ప2' సినిమా రిలీజ్ కారణంగా.. హాలీవుడ్ సూపర్ హిట్ మూవీ ఇంటర్‌స్టెల్లార్ రీ రిలీజ్ వాయిదా పడిందని విమర్శిస్తూ కొంతమంది నెటిజన్స్ పోస్ట్‌లు పెడుతున్నారు. ఇంటర్‌స్టెల్లార్ విడుదలై పదేళ్లు అవుతున్న సందర్భంగా ఆ సినిమాను రీ రిలీజ్ చేయాలనీ భావించారు. అయితే ఇప్పుడు ఇండియాలో ఎక్కువ థియేటర్స్ లో పుష్ప 2 సందడి చేయడంతో ఇంటర్‌స్టెల్లార్ సినిమాను ఇండియాలో వాయిదా వేయాలని అనుకుంటున్నారు. దాంతో పుష్ప సినిమాను విమర్శిస్తూ కొందరు పోస్ట్ లు పెడుతున్నారు. తాజాగా దీనికి జాన్వీ కపూర్ కౌంటర్ ఇచ్చింది. "పుష్ప సినిమాను మరో సినిమాతో ఎందుకు పోల్చుతున్నారు. హాలీవుడ్ సినిమాలు మన సినిమాల పై ప్రశంసలు కురిపిస్తుంటే.. మనం మాత్రం ఇలా మన సినిమాలను తక్కువ చేసి కామెంట్స్ చేస్తున్నాం. మన సినిమాలను మనల్ని మనమే అవమానించుకుంటూ ఉండిపోతున్నాం. ఇలాంటివి చూసినప్పుడు బాధగా అనిపిస్తుంది అని చెప్పుకొచ్చింది జాన్వీ కపూర్.

## పాదచారులపైకి దూసుకెళ్లిన బస్సు.. ఆరుగురు దుర్మరణం




మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముంబైలోని కుర్లాలో మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన బెస్ట్ బస్సు అదుపుతప్పి పాదచారులపైకి దూసుకెళ్లింది. దీంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 49 మంది గాయపడ్డారు. సోమవారం రాత్రి కుర్లా నుంచి అంధేరికి వెళ్తున్న బెస్ట్ బస్సు బుద్ధ కాలనీ వద్ద బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో అది పాదచారులు, కొన్ని వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగ్రాతులను దవాఖానకు తరలించారు.

## సిరాజ్‌కు జరిమానా




ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు గాను టీమ్ఇండియా పేసర్ మహ్మద్ సిరాజ్ జరిమానా ఎదుర్కొన్నాడు. అడిలైడ్ టెస్టులో భాగంగా ఆసీస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేసిన తర్వాత ఆ ఇద్దరూ వాగ్వాదానికి దిగారు. దీంతో ఐసీసీ.. సిరాజ్ మ్యాచ్ ఫీజులో 20 శాతం కోతతో పాటు డీమెరిట్ పాయింట్ విధించింది. హెడ్‌కు జరిమానా లేకపోయినా డీమెరిట్ పాయింట్ ఇచ్చింది.

## జగపతిబాబుకి ప్రభాస్ 'రాజు' మర్యాద..!



టాలీవుడ్ యాక్టర్స్‌లో ప్రభాస్‌కి ఎలాంటి పేరుందో అందరికీ తెలిసిందే. అయితే, ఆయన తన సినిమాలో పనిచేసే ఇతర నటీనటులకు ఎలాంటి ట్రీట్‌మెంట్ ఇస్తారో ఇప్పటికే చాలా మంది స్టార్స్ పలు ఇంటర్వ్యూలలో పేర్కొన్నారు. ప్రభాస్ ఇంటి నుండి వచ్చే భోజనం నిజమైన బాహుబలి అని పలువురు కామెంట్ చేశారు. ఇక ప్రభాస్ ఇచ్చే ఫుడ్ ట్రీట్ కూడా ఆ రేంజ్‌లో ఉంటుందని ఆయన్ను సన్నిహితంగా చూసినవారు చెబుతారు. అయితే, తాజాగా ఇదే విషయాన్ని మరోసారి ప్రూవ్ చేశాడు ప్రభాస్. విలక్షణ నటుడు జగపతి బాబు తాజాగా ప్రభాస్ భోజన విందుకి ముగ్ధుడయ్యాడు. భీమవరంలో సినిమా షూటింగ్‌కి వచ్చిన తనకు వివాహ భోజనాన్ని తలపించే భోజనం రాజుగారు పంపించారని.. దీన్ని బకాసరుడిలా తిని కుంభకర్ణుడులా పడుకున్నానని జగపతి బాబు తాజాగా ఓ వీడియో రూపంలో తెలిపాడు.